


# తిరగబడ్డ భూమి

## వుప్పల నరసింహం

"ఊళ్లెకు గిర్దావర్ వొస్తే వాని సుట్టు దిర్గాలే, అమీన్‌సాబొస్తే ఆని ఎనక దిర్గాలె తహసిల్దారొస్తే సంకల కట్టి యిరికించ్చుకుని సొకలిండు, సాలిండు, ఎక్కలిండు, ఎనాదు లిండు తర్వాయిన తిర్గాలే — ఈల్లుగాక యెల్లిగాడు, మల్లిగాడు యెవడొచ్చినా ముందుగాల నా పంగ పల్గుతది — నీళ్ళు దెచ్చుడు కాడ్నుంచి కట్టెలు కొట్టేదాక యిరాం లేకుంట, రెక్కకు తైన్ లేకుంట గాడ్దిలెక్క ఒకటే పనాయే—నీయవ్వ, పనికున్నవారేతు....అరె. జెరంతనన్న ఈ శెత్త (శరీరం)కు 'ఇరాం' ఇయ్యాలె! ఎక్కడ్డి ?—ఎద్దుకు ముల్లుగర్ర పొడ్సినట్టె ఈడుగాకుంటె ఆడు—ఆడుగాకుంటె ఈడు ఊడిబట్టనే ఉంటరు — ఒగడుగాకుంటె ఒగడు పని శెప్పుడేనాయే.... నీ యవ్వ ఒతుకు కున్న వారేతు......."

అని కావలి ముత్యాలు స్వగతంలో గొణుగుకుంటూ వడివడిగా ముందుకు అడుగులేస్తున్నాడు.

తనలో పెల్లుబుకుతున్న కోపాన్ని, చిరాకను, అసహాయతను, అలసటను, ఆవేశాన్ని మరో రూపంలో వెళ్ళగక్కలేక ముత్యాలు ప్రతిసారి ఇలాగే గొణుగుతూ పనిచేస్తాడు—కదా అని చెప్పేవాళ్ళుకూడా ఇంకా కొన్ని పనులు ఎక్కువ చెపుతూనే వుంటారు—ముత్యాలు తెగించి ఒక్క మాటకూడా తన పై వాళ్ళను అనలేడు...

కావలి ముత్యాలుచేతులో కర్రవుంది—ఆకర్రకు ఒకవైపు ఇనుముతో తయారు చేసిన 'బాకు' దిగేసివుంది—తన నడకకు అనుగుణంగా కర్రను వూపుతూ నడుస్తూ వున్నాడు — కావలి ముత్యాలు నడుస్తున్నప్పుడు, లయబద్ధంగా 'బాకు' కదలడం ఎంతో హుందాగా వుంది ఆయనకు—

ఎడమ భుజంపై గొంగడి జారుతున్నప్పుడల్లా ఎగదోసుకుంటూ అడుగులేస్తున్నాడు – ఎడమచేతికి వున్న వెండి 'కడెం' ఎండకు 'తళుక్కు' మంటోంది—ఎడమచేతి వేలికి ఉన్న రాగి ఉంగరం కూడా సూర్య కిరణాలు పడినప్పుడల్లా మెరుస్తూ వుంది—

పిడికెడు పిడికెడు మీసాలు – వెడల్పయిన మొఖం తలకు రుమాలు, చెవి ప్రక్కన రుమాలుకు ఆనుకుని సగం కాల్చిన 'చుట్ట'—చెవికి రాగిపోగు – పైకి ఎగకట్టిన ముతక ధోవతి – ముతక కమీజు—కమీజు అక్కడక్కడ చిరిగింది – కాళ్ళకు చెప్పులు లేవు – బలంగా అడుగులేస్తూ కావలి ముత్యాలు స్వగతంలో గొణుకుతూ నడుస్తూ వున్నాడు –

తెలంగాణ ప్రాంతం గ్రామాల్లో దుష్ట చతుష్టయరిగా పేరుమోసిన సర్పంచ్, కరణం, పట్వారి, పోలీస్ పటేల్ అధికార్ల ఆజ్ఞలను పాటిస్తూ, వారి వారి ఇంటి పనులుగూడ 'చేస్తూ' పై అధికారి ఎవరైనా వస్తే వారి సకల సౌకర్యాల ఏర్పాట్లలో

తల మునకలయ్యే 'కావలి' వాళ్ళలో ఒకడు ఈ కావలి ముత్యాలు – (కొన్ని ప్రాంతాలలో వీరిని 'మస్కూర్' అని గూడా అంటారు–)

గ్రామాధికార్లు ఈ కావలి వాళ్ళతో తమ ఇంటిపనులు ఎక్కువగా చేయించు కుంటారు – అసంతృప్తిని ఎలా తెలియ జేయాలో తెలియక ఒంటరిగా ఉన్నప్పుడు తిట్టడమో, గొణుక్కోవడమో చేస్తూ వుంటారు–ముత్యాలుగూడా ఆదేరకమైన అసంతృప్తిని పట్వారివద్ద వెళ్ళగక్కలేక నడుస్తూ...."నీయమ్మ కూరుకు పొద్దుగాల లేశి పంతులు (పట్వారి) ఇంటి ముంగట దీటి సలామ్ చేస్నాగాని కైకరమొఖపోడు కసురుకుంటనే వుంటడు...." అని గొణుగుతూ గొల్లకొమ్రమరయ్య ఇంటిముందు ఆగాడు–

వాకిట్లో ఎవరు కనిపించకపోయే సరికి "ఓ... కొమ్రమరయ్యబావా" అని పిలుస్తూ ముత్యాలు ఇంటి వసారాలోకి వచ్చాడు–

గొల్ల కొమ్రమరయ్య గొర్రె బూరుతో దారం వడుకుతూ కూర్చున్నాడు. కాళ్ళ మీద–కావలి ముత్యాలును చూసి "నువ్వా?" అని "కూసో అట్ల పీటమీద కూసో" అన్నాడు నిదానంగా గొల్ల కొమ్రమరయ్య.

"నేనేం కూసుంతందుకురాలేదే బావా"

"పనిమీదనే వస్తే వస్తివిగాని కూసో రాదోయ్"

"బయట పనుంది వెల్లి పోవాల్నే"— ముత్యాలు.

"ఏహే....పోదువు కూసోవోస – ఎప్పు డొచ్చినా గుర్రం మీదనే వస్తవు. పోకుంటే వుండిపోమంటలేను గని కూసోని సంగతేందో శెప్పు" అన్నాడు కొమ్రమరయ్య దీర్ఘం దీస్తూ.

ముత్యాలు వసారాలోని గుంజకు ఆనుకుని కూర్చున్నాడు.

కొమ్రమరయ్య బుడ్డగోచి పెట్టుకుని కింద గొంగడి వేసుకుని కూర్చుని, తొడకు దారం వడికే పకును గట్టిగా రుద్ది తిప్పుతూ గొర్రెబూరుతో దారం తీస్తున్నాడు– తలకు రుమాలు–చెవికి రాగిపోగు, చేతికి వెండిది 'దండె కడెం' వుంది– రెండు చేతుల వేళ్ళకు రాగి వుంగరాలు వున్నాయి. నడుముకు వెండి గొలుసు వ్రేలాడుతూ వుంది. దాంతోపాటు పొగాకు తోలుసంచి వ్రేలాడుతూవుంది–కమీజులేదు. ఛాతిమీద వెంట్రుకలు గూడ తెల్ల బడ్డాయి– పిక్కల మీద చర్మం ముడతలు పడ్డది. మనిషి చూపులకు బలంగానే కనిపిస్తున్నాడు. మీసాలు మరింత గంభీరాన్ని తెచ్చి పెట్టాయి కొమ్రమరయ్యకు—

పేడ, ఎర్రమట్టి కలిపిన వసారాలో అంతకు ముందే అలకడంవల్ల ముత్యాలుకు అదోరకమైన వాసన వేస్తుంది, ఆ వాసనే గాకుండా ప్రతి గొల్లవాళ్ళ ఇంట్లో వచ్చే "గొర్రెలమంద" వాసన వస్తోంది–

కొమ్రమరయ్య దారం వడుకుతూనే "ఆ....ఏందోయ్ ఏం పనిమీద వచ్చినవ్– ఏంది కత–హా...." అన్నాడు–ఆగొంతులో బావ, బావమరదుల వరసతోకూడిన పరాచిక భావం ద్యోతకమయింది–

కావలి ముత్యాలు చెవి వెనకాల వున్న చుట్టదీసి చేతిలో పట్టుకొని.

"ఏంది ఏందే, పోయిన శేస్తారం పన్ను గట్టుమన్నాడు పంతులు అని శెప్పిపోతి నీకు – నీకు అంతగనం శెప్పినా శెవుమీద పేనే పారలేదు–ఆడ దినాం పంతులు నన్ను తిట్లు పెడుతుండు – "శెప్పినావ్‌రా కొమ్రిగానికి శెప్పినావ్‌రా" అని అడిగితె శెప్పిన పంతులు, శెప్పినపంతులు అని శెప్పవట్టి–నువ్వేమో ఈడ అకరు పికరు లేకుంట జీవాలను సూసుకుంట దారం వడుకుంట నిమ్మలంగ కూసుంటివి–నీపని పరాకత్‌గుంది – నేనేమో వానితోని, వీని తోని తిట్లు వడుకుంట నిష్టూరం గావాలే... నీయవ్వ..." అన్నాడు.

"అరె, శెప్పినవ్‌రా–శెప్పలేదని అంట లేను గదరా...."

"శెప్పినవంటవు– పన్నుగట్టక పోతివి–వారం దినాలయి పాయె–ఆడ బోయినా కష్టమే, నిష్టూరమే—ఇగ పంతులు నా మీద గరమయితుండు-ఏమన సప్పుడు జెయ్యకుంట ఎన్ని అన్నా



పడుతున్న—ఏం జయ్యాలే ఏక్కడ నక్కిలేక 'కావలితనం' చేశినట్టుగున్నది. అంత్ల వచ్చేది ఏంలేదు—పైకం భాగోతు లోళ్లకి, తిట్లు మంగలోనికి అన్నశాస్త్ర ముంది శాకత" హెచ్చు స్వరంతోనే అన్నాడు కావలి ముత్యాలు.

"అనంగానే పైసలు ఎత్తయా? నీ కత గాలి రెండురోజులు అటు, ఇటు అయితది—పన్నులు గట్టకుంటె అయితదా గాని!! కడత మోయ్ బామ్మర్ది..." అన్నాడు కొమ్రమరయ్య 'బామర్ది' అన్న పదాన్ని వత్తి పలుకుతూ...

కావలి ముత్యాలు చుట్ట మొదలును వొత్తుతూ "జరంత ఇంగలమైన ఇయ్యి" అన్నాడు.

గొల్ల కొమ్రమరయ్య దారం వడికే 'ఏకు' ను గట్టిగా తొడకు రుద్దుకుని వదిలేసి పొగాకు సంచిలోనుంచి కొంత జెక ముక దూది, రాయి ముత్యాలు వైపు విసిరాడు—ఈ లోపుగా ఏకు గిరిగిరా తిరిగి దారానికి 'కరి' పడ్డది— కొమ్రమరయ్య ఏకును అందుకుని దారాన్ని ఏకుకు చుట్టాడు—

ఎడమ చేతిలోవున్న గొర్రె బూరు, కుడి చేతిలోవున్న ఏకు క్రింద పెట్టి కొమ్రమరయ్య రుమాల్లో వున్న కరకు చుట్ట దీసాడు. తానూ రెండు బుక్కలు చుట్ట త్రాగుదా మని—ముత్యాలు జెకముకతో అగ్గి జేసి కొంత తన చుట్ట మొదట పెట్టుకుని కొంత అగ్గి కొమ్రమరయ్యకు ఇచ్చి, ముత్యాలు గట్టిగా రెండు దమ్ములు లాగాడు.

కొమ్రమరయ్య ముత్యాలు ఇచ్చిన అగ్గిని చుట్ట మొదట పెట్టుకుని తల వంకరదా బెట్టి, నిప్పు క్రిందపడిపోకుండా గట్టిగా పొగపీల్చాడు - ఆ తరువాత ముత్యాలు వద్దనుంచి జెకముకరాయి తీసుకుని తన సంచిలో వేసుకుని ఏకును, గొర్రె బూరును చేతిలోకి తీసుకున్నాడు—చుట్ట నోట్లోనే వుంది.

"ముత్యాలు గట్టిగా పొగపీల్చిన తరువాత వాకిట్లోకి ఉమ్మి,

"పైసల్. లేవంటవూ? మొన్న నేగదా జీవాలమ్మినవ్! పైసలేంజేస్తివి ఇంతలమే" అన్నాడు—

కొమ్రమరయ్య పక్కకువున్న బూడిది పోసిన చిన్నడబ్బాలో వూసి,

"జీవాలమ్మితే ఏం ఫాయిదయింది—కట్టెటోనికి గత్తి, ఇచ్చెటోన్కి ఇస్తి—తెచ్చేటివి శెస్తి ఇంక వున్నాయి? పోయిన్న శివరాత్రి లగ్గాలళ్ళ శిన్నపోల్ల పెండ్లి జేస్తే ఐదువేల, ఖర్సయింది—మల్ల అత్త గారు ఏం బెట్టలేదు, ఏం బెట్టలేదు అని శెప్పుక తిర్గుతున్నరే—సావుకారి దెగ్గర దెచ్చిన అప్పు ఇంక తీరనేలేదు-సాలాయన దగ్గర తెచ్చిన బట్టల పైసలు ఇంక ఇయ్యనేలేదు .... ఎన్ని జీవాలమ్మితేమి—— ఎన్ని గొంగళ్ళమ్మితేముంది—షడి కాడికే అయితుంది సంసారం—" అన్నాడు—


"మరి ఎట్లజేస్త నంటవ్ పన్నుల సంగతి?"

"ఎట్లజేశేది ఏముంది? పెద్దపోరడు. ఐలయ్య అత్తగారింటికి పోయి ఐదు దినా లాయె—రేపొస్తడో మాపొస్తాడో అని రోజూ యెదిరి సూస్తున్నాం—ఆడు రాంగనే కడ్తం ఫో—కట్టకుంటె యాడి కన్న పోతమా?" కొమ్రమరయ్య.

"యాడన్న పోవుడుసవాల్ గాదు-ఇయ్యాల గాకుంటే రేపుగట్టవు—పన్నులు గట్టక పోకోవుగాని. ఆడ రాకాసి మొఖపోడు పట్వారి వూకుంటడా——"ఏమా యెరా. పోయొచ్చినవా—వసూలు చేస్కొచ్చినవా" అని అడుగుతాడు "ఇయ్యాళ రేపట్ల గట్తనన్నడు పంతులు" అంటే ఇగమెటు కూతలు కూస్తడు—సీతల్లి ఇద్దరి పొత్తుల నేను పొట్లు దినాలే" అని కావలిముత్యాలు వాకిట్లోకి వూసి చుట్ట తాగడం ప్రారంభించాడు——

"నాదిక్కుకేలి నువ్వేందుకు పొట్లు దింటు వోయి నేనొచ్చి పంతులును కలుస్తఫో——పొద్మీకె జాముల పంతులు ఇంటికొస్తాఫో" అన్నాడు ఏకును తొడుకు రుద్దుకుంటూ






కొమ్రమరయ్య.

"వొస్తే వచ్చి మాట్లాడ్తవేమో గాని దుగ్గక్క కనిపిస్తలేదు యింట్ల?" అని అడిగాడు కావలి ముత్యాలు-

"పెద్ద పోరడు లేకపాయె. రాత్రిళ్ళ చిన్న పోరడు కిష్టయ్య పశేలు పొలంల మంద పెట్టిండు. పొద్దన్న సద్ది తీస్క పోయింది. వస్తుండొచ్చు, శాలసేపయింది పోయి" కొమ్రమరయ్య.

"జెరన్ని జొన్నలు పెట్టక పోయినవ్ బావా—తమామ్ తింతందుకు లేకుంట అయినయ్"-ముత్యాలు.

"జొన్నలు ఏడియోయ్-మేమే కొనుకోని తింటున్నం—మెన్నసే పాపిరెడ్డి దగ్గర పావుపళ్ళ జొన్నలు కొనకొచ్చిండు పెద్దపోరడు. అవి దుడిశి పోయినయ్ ఎండవోశి, శేశి, యిసురుకోని రొట్టె చేస్తున్నది మీ యక్క-" కొమ్రమరయ్య-

"శెల్కల పండిన జొన్నలేమాయె బావా? అప్పుడే అయిపోయినాయా?" కాలికి తనవైపుకు వచ్చిన గొర్రె బూరును కొమ్రమరయ్య వైపుకు వేస్తూ అడిగాడు ముత్యాలు.

"శెల్కల ఏమంత పండినయోయ్ పిలగా, రోణి కార్తెల (రోహిణి కార్తెల) వాన గొట్టె-కాలుకు శేశికి యిరాము లేకుంట పొద్దు, మాపు ఇంటిల్లాకులం మర్లాడి దున్ని మక్కజొన్న అలికితే.... తల జుట్టు లేశేయాళ్ళకు జోరు ఎండలు గొట్టె ఒక్క వాన గూడా కొట్టపోయె. కంకెడు కంకెడు కంకి అయితదను కుంటె పిడస కట్టుకుపోయి నట్టయింది. కంకి శెట్టు పైకి లేవకనేపాయె ఇగ ఇరిగిన కంకులు వాకిట్ల మంచెమీద రెన్నెల్లు వుండె. సొప్ప జెరంత అమ్మి జెరంత ఉంచుకుంటి. ఇగ మా సడ్డకుడు పడమటి కేలి వచ్చి.... 'కాలంగా లేదు ఎడు సచ్చిపోతున్నయ్' అని శెప్పి అయినంత సొప్ప, ముత్తుం మక్కజొన్నలల్ల కెలి ఒతూమెడు మక్క జొన్నలు దీసుక పోయిండు—మిగిలిన

జొన్నలు మొన్నటిదాక మాకే ఒడిశినయ్. అవి అయిపోయినంకనే పెద్దపోరడు పావు వళ్ళ తీస్కొచ్చిండు—" అని కొమ్రమరయ్య బ్బాలో వూసాడు. ఉమ్మి వూసేప్పుడు మీసాలకు అంటుకున్న తడిని రుమాలు కొసతో భుజంతోనే తుడుచుకున్నాడు—

ావలి ముత్యాలు సుట్టను నేలకరాసి క్రిందరాలిన అగ్గిని కాలితో రాసి కరకు సుట్టను తిరిగి చెవి వెనకాల పెట్టుకుని వాకిట్లోకి వూసాడు.

ఇంతలోకి తలపై తట్టతో దుర్గమ్మ వచ్చి "బాగున్నావురా ముత్యాలు" అని ముత్యాలును పలకరించింది.

"ఆ....బాగున్నానక్కా" ముత్యాలు.

"మా మర్దలు బాగుందా? పోరలు ఎట్లున్నరు?"

"అందరు బాగనే వున్నరక్కా" ముత్యాలు.

"శాల దూరం వచ్చినవేం తమ్మి"— దుర్గమ్మ

"బావదగ్గర్కే వచ్చిన అక్కా"

"అట్లనా" అంటూ దుర్గమ్మ 'జారాట్లో' కాళ్ళుకడుక్కొని తట్టతో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఈ సారి కాల మెట్లుందంటవే కొమ్రమరయ్య బావా?" అని అడిగాడు ముత్యాలు కొమ్రమరయ్య వైపు చూస్తూ.

"కాలం సంగతి ఎట్లచెప్పొస్తదిరా ముత్యాలు. రెండేండ్ల నుంచైతే శెరువునిండక పాయె-శెల్కలల్లో పంటలు గూడ గట్ల గట్లనే వుండి-శెరువుకింద పొలాలు అల్లకుంట అయిపాయె-పని బాటల్లోళ్ళయినా ము భూములోళ్ల శెట్లు మొల్వనట్టే ఈ సారైనా వానలు గొట్టి శెరువునిండితే పమన్న ఒతుకు దెరువైతది - లేకపోతె పుణ్యానికి సస్తరు మంది" త్యతిష్యం చెప్పినట్టు చెప్పాడు కొమ్రమరయ్య దారం వడుకుతూ.

"నీయవ్వ.... సైనైతే ఉరిపోసుకుని సచ్చేటట్టుండే ఈ సారి వానలు గొట్టక పోతె-రెండేండ్ల నుంచి పొలం అల్కుడు లే పాయె-కళ్ళాలకాడ ఇంత బిచ్చమొతె ఇన్ని గింజలు దొరుకు అవి కరువైపాయె-మూన్నెల్ల నుంచి జీతం పైకం రాకపాయె పైస పైసకు ఎంత తక్లీఫ్ అయితుందో ఆ పరమాత్మునికే ఎరుక-అదల్ బదల్ ఎంత కాలమని దెచ్చి ఎల్లదీస్తం-ఈ బాధలు, కష్టాలు పడలేక ఎక్కడైనా పోదా మన్నంత యాష్టొస్తుంది - పోత్తే "వొంగలేనోడు దొంగల్ల పోయిండ"ని బదులాము యేడ పడుదునని ఇజ్జత్కు అన్ని బాధలు వోర్సుకుని బతుకుతున్న...." బొంగురు కంఠంతో అన్నాడు ముత్యాలు.

"మూన్నెల్ల నుంచి జీతం రాలేదారా నీకు?" అని అడిగాడు కొమ్రమరయ్య-ఆ గొంతులో ఆశ్చర్యం కనిపించింది.

"నీతోటి అబద్దమాడ్తాను – రాలేదు బావా మూన్నెల్ల నుంచి పొయ్యిలకు పొయ్యిమీదికి శిన్న తక్లీఫ్ అయిత లేదు. గిజగిజానుకుంట కాలం ఎల్లదీస్తున్నాం. అది ఒక్కటి ఎంత గసమని కష్టపడ్తది. ఒక్క రెక్కమీద సంసారం ఎల్లాలంటే-ఈ కరువు గొట్టు దినాలల్ల" అని దీనంగా అన్నాడు ముత్యాలు.

"మరి, అడుగొద్దురా పట్వారిని" కొమ్రమరయ్య.

"అడిగిననే"

"ఏమంటడు మరి"

"ఏ ముంటడు-తశీల్ నుంచీ ఇంక రాలేదంటడు. గిట్ల తక్లీఫ్ అయితుంది. పంతులూ అంటే నన్నేం జెయ్యమంటావ్ రా అన్నడు— ఒక్క సారి అడిగితే, రెండు సార్లు అడిగితే అడిగి నప్పుడల్ల గట్లనే అన వట్టె జగ అడగొద్దని సాలిచ్చుకున్న"

"తశీల్ (తహసీల్ ఆఫీసు) కన్నపోయి గిట్ల గిట్ల సంగతని శెప్పనుంటివి—" కొమ్రమరయ్య సలహా ఇచ్చాడు.

"నాకు సదువొస్తదా, సదువొస్తదా ఎడంట పిర్యాదు జెయ్యాలె - ఎడంట మొత్తుకోవాలె-ఎటుతోస్త లేదు. ఈ ఐదారు



ఇప్పుడే కొనండి! మరింత ఆదా చెయ్యండి!

2 రూపాయట ఆదా చెయ్యండి

క్యాడ్‌బరీస్

బోర్న్‌విటా

500 గ్రాముల బోర్న్‌విటా రీఫిల్ ప్యాక్ కొనండి




అదే మేలైన లక్షణం,
అదే తాజాదనం,
అదే మజా రుచి

ఈ రీఫిల్ ప్యాక్ ప్రత్యేక నమూనాతో సీలు చేయబడటం వల్ల అప్పుడే ఫ్యాక్టరీలోంచి బయటి కొచ్చినప్పటి బోర్న్‌విటా తాజాదనం అలాగే ఉంటుంది. దీన్ని తెరిచిన తర్వాత, మీరు చేయవలసిందల్లా, మీ పాత బోర్న్‌విటా డబ్బాలోకి దాన్ని పంచెయ్యడమే, మరి దీనిలో గల ప్రకృతిలోని మంచి లక్షణాలన్నీ అలాగే అట్టే వుండిపోతాయిక.

మీ కుటుంబంలోని వారికి బోర్న్‌విటా ఇవ్వండి. దీని రుచి వారికి ఎంతో బాగా నచ్చుతుంది. త్వరపడండి. ప్రత్యేకంగా ఆదా చేసిపెట్టే 500 గ్రాముల మీ రీఫిల్ ప్యాక్‌ను తీసుకోండి. మీ బోర్న్‌విటా తాగండి.

త్వరపడండి! సరుకు పరిమితం!

క్యాడ్‌బరీస్
బోర్న్‌విటా
దీన్లోని మంచి లక్షణాలన్నీ మీకోసం

OBM/7043/TL

రోజులు సంది అయితే పిచ్చతేశినట్టుంది- ఏపని చేయ బోదామన్నా మనసుకు పడ్తలేదు - బెచైన్, బెచైన్ గుంది."

తన బాధలు, కష్టాలు చెప్పుకోవడం వల్ల ముత్యాలుకు ఉదయంనుంచి ఉన్న బరువు తగ్గుకున్నట్టనిపించింది—తనలోవున్న కోపం ఆక్రోశం, అలసట మంచులా కరిగిపోతున్న ట్టనిపించింది—అ ఉత్సాహంతోనే, రెండు అడుగులు ముందుకు జరిగాడు - కొమ్మ రయ్యకు దగ్గరగా కూర్చున్నాడు క్రింద గొంగడి వేసుకుని.

"మరి ఎట్ల జేస్తనను కుంటున్నవ్ రా" కొమ్మరయ్య.

"ఏం జెయ్యాల్నో తోస్తలేదే - నువ్వన్న జెప్పు ఎట్లజేస్తే బాగుంటదో" అని అడిగాడు ముత్యాలు.

"ఎట్లజేస్తవేంది - మనూర్ల మొన్న "సంఘం" బెట్టిండ్రుగదా. సంఘంల వున్నోల్లను యిశారియ్యి—వాళ్ళు ఏమంటరో తెలుస్తది" కొమ్మరయ్య.

"సంఘంల శేరినోళ్ళు తా మనుషులను సంపేటోళ్ళు, దోసుకునేటోళ్ళు – మొన్న మా పంతులు ఎవరితోనో అంటుంటే యిన్న - ఆళ్ళను యిశారిస్తే అయితదంటవా? నీ లెక్కన మొన్న మా పాపయ్య మామ గూడ అన్నాడు గాని నేను మనసు మీద పెట్టలేదు—" తన సందేహాన్ని వ్యక్తంచేశాడు ముత్యాలు.

"మీ పంతులుజేసే దొంగలెక్కలకు ఖలాస్ గ కొట్లాడేటోళ్ళు ఎట్ల దోసుకుంటరురా నీ మాటలిగాని - మా తమ్ముని కొడుకు బీరప్పగాడు సంఘంల జేరిండు—యిప్పుడు ఆడే సంఘంల పెద్దనంట-ఆడు మనిషులను సంపుతడా-అని గుణం నీకుగుర్తే కదరా! నువ్ వాణ్ణిపోయి కలువ్ నీకు అన్నిసంగతులు యిప్పి జెప్పుతడు." అని కొమ్మరయ్య ముత్యాలుకు చెప్పాడు.

కావలి ముత్యాలుకు ఏదో కాంతి కిరణం కనిపించినట్లయింది-తాను చీకటిలో లేనని తోచింది. తనకు ఆసరాగా ఊతగా ఒకరున్నారనిపించింది— అలా అని పించే సరికి మనసు కాస్త కుదుట పడింది- కళ్ళు మెరిశాయి. అప్రయత్నంగా కళ్ళల్లోకి నీళ్ళు వచ్చాయి. గొంతు పొడ మారి నట్టయింది. సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతూ,

"అయితే బీరప్పగారిని కలువు మంటావా" అని అడిగాడు.

"కలుస్తనే మల్ల ఏదైన తోవ బుట్టది నువ్వు వూకుంటే గిట్లనే కాలం గుజురా యించిపోతది. నిన్ను గిట్ల ఏసుకపోతరు" అన్నాడు కొమ్మరయ్య.

కావలి ముత్యాలుకు బీరప్పను కలవాలన్న కోరిక బలపడింది. అలా అనిపించడం వల్ల ముత్యాలుకు కొండంత బలం వచ్చింది. గుండెల మీద అంతవరకు గుండులా వున్న బరువు తొలగించినట్లయింది-శ్వాస సునాయాసంగా తీసుకుంటున్నట్టు అనుభూతి చెందాడు.

"అయితే నేనే పోయొస్త బావా" ముత్యాలు.

"పోయొస్తవా?........ ఆ.... అట్లనే కొనింటి నర్సిరెడ్డి శెవులగూడ ఎయ్యి ఈ ముచ్చట-ఇద్దర్ ముగ్గురు శెవుల ఏస్తేనే మంచిది ఏ ముచ్చటైన" మరో సలహా ఇచ్చాడు కొమ్మరయ్య.

"మంచిది పొద్మకి కలుసుకోని శెప్త" అని ముత్యాలు లేచాడు. క్రిందనున్న గొంగడి భుజంపై వేసుకున్నాడు. ప్రక్కకు పెట్టిన కర్రను తీసుకొని "ఇగ మరి నేన్ పోయొస్త బావా" అన్నాడు.

"మంచిది—పొద్మకె జాములు వచ్చి పంతుల్ను కలుస్త పో"—కొమ్మరయ్య.


"నీ యిష్టం-నేన్ పోతున్నా...."

"పో....పో...."

కావలి ముత్యాలు అటు, ఇటు చూడకుండా పరుగులాంటి నడకతో పట్వారి ఇంటికి చేరాడు.

పట్వారి ప్రహ్లాదరావు వసారాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు - అతని






ప్రక్కకు మరో కుర్చీలో స్కూల్ టీచర్ రామారావు కూర్చున్నాడు. కొద్ది దూరంలో కావలి చంద్రయ్య నిలబడ్డాడు ప్రహరిగోడ ఈవల ఇద్దరు - ముగురు రైతులు నిల్చున్నారు.

ప్రహ్లాదరావు ఇంట్లోనుంచి సన్నగా రేడియో పాటలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రహ్లాదరావు భార్య లక్ష్మమ్మ కేకలు వినిపిస్తున్నాయి.

రామారావు ప్రహ్లాదరావు మాట్లాడుకునేప్పుడు కావలి ముత్యాలు గేటు వద్దకు వచ్చాడు.

కావలి ముత్యాలును ప్రహ్లాదరావు చూడగానే "ఏమాయెరా? పోయొచ్చిన వారె ఆ కొమ్మిగని దగ్గర్కి?" అని అడిగాడు.

కావలి ముత్యాలు క్రిందికి చూసుకుంటు చేతిలో వున్న కర్రతో క్రిందపొడుస్తూ "పోయొచ్చిన పంతులు—అప్పటకొచ్చి కలుస్త నన్నడు" అని చెప్పాడు.

"వాడు ఏమనుకుంటుండు ఇంతకు -పది రోజుల సంది పన్ను గట్టమంటే నీల్గుతున్నడేంది? ఇంతకు నువ్వు పోయినావా?లేదా?" ప్రహ్లాదరావు.

ముత్యాలు మనసు చివుక్కు మన్నది. పుండు మీద కారం చల్లినట్లయింది. ఒక్క క్షణం పట్వారివైపు సూటిగా చూసి,

"నా పిల్ల లల తోడు పంతులు—ఇప్పుడు ఆడికెల్లే వస్తున్నా" అని కుడిచేతిని తలపై పెట్టుకున్నాడు.

"మరి ఆడికెల్లి వస్తున్నోనివి తన్నొచ్చుకుంట గుంజుకరావొద్దురా-ఆ కొమ్మిగాణ్ణి ఇంత బీడి సుట్ట దాగి పల్లబడివచ్చినావ్ - నిన్ను

వసూలు చేసుకరమ్మని తోలిస్తా లేక ముచ్చట పెట్టిరమ్మని తోలిన్నరా కావ లోడా" కోపంతో అన్నాడు పట్వారి.

ముత్యాలుకు గూడ కోపం వచ్చింది — కాని పెదవులమధ్యనే ఆకోపాన్ని బిగపట్టి "ఎంత సెప్పాల్నో అంత సెప్పాను. ఇయ్యకుంటే నేనేంజెయ్యాలేపంతులు?" అన్నాడు.

"శేతులు లేనోళ్ళయి పీక్కతినే - పంజేస్తడంట. పజేస్తకు—నువ్ ఎందుకున్నవ్ రా సెప్పినపని సెయ్యక ఇంటి-వాణ్ణి తన్నుకుంట గుంజుకరానుంటివి. వాని అయ్యసొమ్మా? అమ్మ సొమ్మా? పన్నులు గట్టకపోను - ముందుగాల నిన్ను రెండు తన్నితే పన్నుల పైసలు అవంతల అవే ఉరుకొస్తయ్?" అన్నాడు ప్రహల్లాదరావు కుర్చీలోంచి ఒక్కసారి లేచి—తిరిగి కూర్చున్నాడు—కళ్ళు ఎర్రగా మారాయి - తిట్టేటప్పుడు గొంతు వద్ద నరాలు పొంగుతున్నాయి.

రామారావు, కావలి కేంద్రయ్య, ముత్యాలు వంక దీనంగా చూశారు.

కావలి ముత్యాలు పొంగు కొస్తున్న కోపాన్ని అపుకుని ఒక్కసారి ప్రహల్లాదరావువంక చూశాడు తలెత్తి. వెంటనే ప్రహల్లాదరావు.

"మెడల మీది కేలి సూస్తవేంది కావలి లంజ కొడుకా నీ తల్లి, పెండ్లాన్ని పట్టుకుని ............అని బూతులు తిట్టాడు.

కావలిముత్యాలు మొఖం ఎర్రబారింది. కళ్ళలో ఉక్రోషం బుసలు కొడుతోంది. ముక్కుపుటాలు ఎగురుతున్నాయి. చేతిలో కర్ర బిగుసుకుంటోంది. పాదాల క్రింద భూమి నలిగిపోతోంది. దేహమంతా వేడివల్ల పొగలు గక్కుతున్నట్లనిపించింది. ఆ చండ ప్రచండమైన కోపంతోనే ప్రహల్లాదరావు వంక అలాగే చూస్తూ నిల్చున్నాడు. తరతరాలనుంచి వస్తున్న బానిసత్వాన్ని ఒక్కసారి తెంచుకోలేక.

కావలి ముత్యాలు అలాగే చూడడంతో పట్వారి సహానం దెబ్బతిన్నది. తన అధికారాన్ని ఎదిరిస్తున్నట్టనిపించింది - తన గౌరవాన్ని పెల్లగిస్తున్నట్టనిపించింది. తన వంశ ఆచారాన్ని మర్యాదను మట్టిపాలు చేస్తున్నట్టనిపించింది. ఆ కోపంతోనే,

"ఇంకా చూసుకుంట నిలబడ్డవేందిరా లంజకొడుకా—ఫో—బయటకు ఫో—నీ తాళిబొట్టుల ...." బూతులు తిట్టాడు.

ముత్యాలు కదలలేదు — చూపులు కదల్చలేదు, ఆ చూపులకే శక్తివుంటే ప్రహల్లాదరావునేగాదు ఆయన ఇంటిని గూడ కాల్చేయగలవు—

ఆచూపులు ప్రహల్లాదరావు కోపం అగ్గి మీద గుగ్గిలం వేసినట్టయింది. పట్వారిని రెచ్చగొట్టాయి — ముత్యాలు అంతు చూడాలని మనసు ముందుకు తరిమింది— వెంటనే కుర్చీకి వ్రేలాడేసిన పట్వారి ప్రహల్లాదరావు తనతండ్రిది పాత కర్రను తీసుకుని రెండు అడుగులు ముందుకేసి ముత్యాలు వొంటిపై నాలుగుదెబ్బలు బలంగా వేశాడు—మరో దెబ్బ వెయ్యబోయేసరికి ముత్యాలు పట్వారి కర్రను అందుకుని రెండుముక్కలుజేసి అవతల పారేసాడు—బాకు దిగేసిన తన కర్రను ఎత్తాడు—అంతే పట్వారి పరుగు పరుగున ఇంట్లోకి పరుగుదీశాడు — ఇంతలోపునే రామారావు, కావలి కేంద్రయ్య, గేటు ఈవలవున్న రైతులు అందరూ వచ్చి కావలి ముత్యాలును పట్టుకున్నారు. ఇదంతా క్షణంలో జరిగిపోయింది. చక చకా ఈ సంఘటనలన్ని జరిగిపోయే సరికి అక్కడ వున్న రామారావు గుండె వేగంగా కొట్టుకోసాగింది — అందరూ నిశ్చేష్టులై కావలి ముత్యాలువంక చూస్తూ నిల్చున్నారు—

కావలి ముత్యాలు అందరిని విదిలించుకుని తనకు తగిలిన దెబ్బలను చూసుకుని వీరప్పను కలుద్దామని పట్వారి ఇంటినుంచి బయలుదేరాడు కోపంతో—అతని కళ్ళల్లో ఎదురుతిరిగిన సహనం కనిపించింది...■



ప్రకృతి రహస్యం కనుగొనబడింది!




# ఇది సహజంగా, మృదువుగా మీ వంటి ఛాయను పెంపొందిస్తుంది

ఫెయిర్ అండ్ లవ్లీలో గల ఒక ప్రత్యేకమైన పదార్థం చర్మం లోపల పనిచేస్తుంది. అది సహజంగా, మృదువుగా, సురక్షితంగా. అంతేకాదు, ఫెయిర్ అండ్ లవ్లీ మీ చర్మాన్ని బయట నుంచి కూడా సంరక్షిస్తుంది. దీనిలోని సూర్య కిరణాలను వడపోసే పదార్థాల మిశ్రమం, మీ చర్మం ఎండవల్ల నల్లబడకుండా కాపాడుతుంది. అయినప్పటికీ సూర్య కిరణాలలోని ఆరోగ్యమంతటినీ మీరు పూర్తిగా పొందగలుగుతారు. ఫెయిర్ అండ్ లవ్లీని రోజూ గమనించి వాడితే, 6 వారాలలో మీ శరీర ఛాయను [illegible] ఎర్రబరుస్తుంది.




**ఫెయిర్ అండ్ లవ్లీ** — నల్లని చర్మాన్ని ఎర్ర బరచడం కోసం సున్నితమైన తీరు

[illegible] వారి విశిష్ట ఉత్పత్తి  లింటాస్-FALOV. 18-1716 TE